క్లుప్తంగా

రైల్వే బ్రిడ్జి వద్ద నీరు నిల్వకుండా చూడాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి శివారులోని రైల్వే గేటు 29 రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలువ మొత్తం పూడుకుపోయి వర్షపు నీరు నిల్వ ఉంటుందన్నారు. పంటచేలకు రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నామన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. రైల్వే మేనేజర్ స్పందించి వెంటనే ఉన్నతాధికారులకు వివరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట వైస్ ఎంపీపీ రఘు, గ్రామపెద్దలు అశోక్, రమణ, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

‘ఉదాసీనతగా వ్యవహరించొద్దు’


మాట్లాడుతున్న మల్యాల మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంపై జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం మాట్లాడారు. మిల్లుల యజమానులు వడ్లను మిల్లింగ్ చేసి వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా, గడువు ముగిసిన ఇంకా రూ.44 కోట్లకు పైగా ధాన్యం వ్యాపారుల వద్ద ఉందన్నారు. దీనిని పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటివరకు జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి ప్రసన్నకుమార్, ముక్కెర అశోక్, గజ్జల విలాస్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందేలా చూడాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల డీడబ్ల్యూవోలు, సీడీపీవోలతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిరంతరంగా పనిచేస్తూ.. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని, సీడీపీవోలు ఎప్పటికప్పుడు సందర్శించాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, సీడీపీవోలు పాల్గొన్నారు.

కామ్రేడ్ గిరిప్రసాద్ ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన కామ్రేడ్ గిరిప్రసాద్ ఆశయ సాధనకు సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ 27వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరి ప్రసాద్ విద్యార్థి దశలోనే ఉద్యమ బాట పట్టారన్నారు. 1961లో ఖమ్మం శాసనసభ్యుడిగా ఆయన వ్యవహరించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, బెజ్జంకి నర్సింగ్ రావు, అరిగెల గజారం, అద్దంకి రమేశ్, ఖండాల గణేష్ పాల్గొన్నారు.

కోతుల బెడద తప్పేదెలా?

- రోడ్లపై గుంపులుగా సంచారం
- ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కౌటాల: సీటు కవర్ చింపేస్తున్న కోతి


జిల్లాకేంద్రంలోని బాపూనగర్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కోతులు

ఆసిఫాబాద్‌అర్బన్/కౌటాల: జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుంది. అడవులు అంతరించిపోతుండడంతో అడవుల్లో తినడానికి ఏమి దొరక్క కోతులు గ్రామాల బాట పడుతున్నాయి. ఊళ్లలోకి చేరిన కోతులు వీరంగం సృష్టిస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు కౌటాల మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

ఇళ్లలోకి చొరబడి..

కోతులు ఇళ్లలో కనిపించే వస్తువుల కోసం నేరుగా ఇళ్లలోకే చొరబడి అందిన కాడికి వస్తువులు, సరుకులు అపహరిస్తున్నాయి. జిల్లాకేంద్రంలోని పండ్ల దుకాణదారులు, కిరాణాషాపుల యజమానులు కోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరుకులకు రక్షణగా జాలీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కౌటాల మండల కేంద్రంలోని ఆయా కార్యాలయాలకు వచ్చిన వారు కోతులతో అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం కార్యాలయాల ముందు ఉన్న చెట్లపై కోతులు బారులు తీరి ఉంటున్నాయి. కార్యాలయాల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల సీటు కవర్‌లో పండ్లు, కూరగాయలు, తినుబండారులు వంటివి ఏమైనా ఉంటే వాటి కోసం సీట్ కవర్ చింపేస్తున్నాయి.

దాడులు చేస్తున్న కోతులు

కౌటాల –బెజ్జూర్ రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారులను, ప్రయాణికులను వెంబడిస్తూ పరుగులు పెట్టిస్తున్నాయి. చేతిలో కవరుతో రోడ్డు వెంట వెళ్తే కవర్లు లాక్కుంటున్నాయి. పండ్లు, కూరగాయలు చేతిలో కన్పిస్తే మీద పడి దాడి చేస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో ఇప్పటి వరకు చాలా మంది కోతుల కారణంగా గాయాలపాలయ్యారు.

నియంత్రణ చర్యలు చేపట్టరూ..!

పట్టణంతో పాటు మండలాల్లో కోతుల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి జనావాసాల నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలంటున్నారు.

దాడులు చేస్తున్నాయి



కౌటాల మండల కేంద్రంలో కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కోతులు మండల వాసులపై దాడులు చేస్తున్నాయి. ఎంఈవో కార్యాలయం ముందు నాపై కోతులు దాడి చేశాయి. దీంతో ఆసుపత్రిలో ఇంజక్షన్లు వేసుకోవాల్సి వచ్చింది.

– డి. లాలాజీ, వీర్దండి

భయాందోళన చెందుతున్నాం



కాలనీల్లో కోతులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఇళ్లలోని వస్తువులు, తినుబండారాలను ఎత్తుకెళ్లడంతో భయంతో ఏమి చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. వాటిని తరిమేందుకు ప్రయత్నిస్తే తిరిగి దాడులు చేస్తున్నాయి. కోతులతో తీవ్రంగా భయాందోళన చెందుతున్నాం.

– స్వరూప, ఆసిఫాబాద్

అధికారులు చర్యలు చేపట్టాలి



కోతుల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. కోతుల బెడద రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతుంది. కోతులు ప్రతిదాడులకు దిగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వాటిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టే చర్యలు తీసుకోవాలి.

– కొలిప్యాక సత్యనారాయణ, ఆసిఫాబాద్

పైకప్పులు పగిలిపోతున్నాయి



కౌటాల మండలంలో కోతుల బెడద అధికంగా ఉంది. కోతులు ఇళ్లలోకి చొరబడి ఇళ్లలోని వస్తువులు, కూరగాయలను అపహరిస్తున్నాయి. మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. రేకుల ఇళ్లపైన కోతులు గెంతడంతో ఇళ్ల పైకప్పులు పగిలిపోతున్నాయి.

–సత్తయ్య, బ్యాంక్ కాలనీ, కౌటాల

భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం


ఆలయంలో చండీ హోమం


హోమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం నిర్వహించారు. వాసవీ మందిర 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని గత రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజులో భాగంగా సిద్దిపేటకు చెందిన వేదపండితులు ముదిగొండ నాగరాజ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణలతో మహాచండీ హోమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి యువరాజ హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కన్యకాపరమేశ్వరీ హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా శనివారం పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిరీటం బహూకరణ


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని హనుమాన్ విగ్రహానికి భక్తులు భక్తిశ్రద్ధలతో కిరీటం బహూకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కాషాయం జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో వైద్య శిబిరం


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

కెరమెరి: మండలంలోని ఖైరీ నాయకపుగూడ, ఇంద్రానగర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి క్రాంతికిరణ్ పలువురికి వైద్య పరీక్షలు చేసి తగిన మాత్రలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పలు ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వసంత్, శంకర్, మైనుబాయి, పోశవ్వ తదితరులు ఉన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలు పెంచాలి


ఖైరిగూడ ఓసీ వద్ద కలెక్టర్ వెంకటేష్ దోత్రే

తిర్యాణి: సింగరేణి సంస్థ పరిధిలోని జిల్లాలో గల ఉపరితల గనులలో కార్మికుల సంక్షేమం, రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను పెంచేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. తిర్యాణి మండలంలోని ఖై రిగూడ ఉపరితల గని ప్రాజెక్టును జనరల్ మేనేజర్ నరేందర్, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి ఎంతో చరిత్ర కలిగి ఉందన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతికత, అధునాతన పరికరాలతో బొగ్గు ఉత్పత్తిని పెంచడం జరుగుతుందన్నారు. కార్మికుల సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలతో పాటు కార్మికుల పట్ల రక్షణ పద్ధతులు అవలంభించాలని, సింగరేణి రెస్క్యూ బృందం అప్రమత్తంగా ఉండి ప్రమాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: భజరంగ్‌దళ్ సభ్యులపై దుర్భాషలాడిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మండలంలోని జగన్నాథ్‌పూర్ భీమన్న ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం కాగజ్‌నగర్ రూరల్ సీఐ అసందర్భంగా అక్కడ ఉన్న ఆలయ కమిటీ సభ్యులను, భజరంగ్‌దళ్ సంస్థను దుర్భాషలాడడంతో పాటు కేసులు పెడుతానని బెదిరించినట్లు ఆరోపించారు. అదేవిధంగా ఎమ్మెల్యేపై కేసు పెడతానని, ఎవరూ అడ్డువచ్చినా కేసులు పెట్టి లోపల పడేస్తానంటూ ఇష్టారీతిగా మాట్లాడారని భజరంగ్‌దళ్ నాయకులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. హిందూ దేవుళ్లను కించపరిచిన సీఐ రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ధర్నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, వీరభద్రచారి మద్దతు తెలిపారు. సీఐని సస్పెండ్ చేసేంతవరకు ధర్నా విరమించేదిలేదని నాయకులు స్పష్టం చేశారు.

దరఖాస్తుకు చివరి రోజు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోకుండా ఉన్న 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు నేడు చివరి రోజును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్‌లోని చారిగాం శివారులో అక్రమ మైనింగ్ స్థలంలో జర్నలిస్టు తిరుపతిపై మైనింగ్ నిర్వాహకులు దాడి చేశారని, మట్టి తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలో మైనింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. మైనింగ్ ఏడీ గంగాధర్‌రావు మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రాంతంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు చేపడితే తమ శాఖ అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ సురేశ్, కోశాధికారి శ్రీధర్, సభ్యులు మహేష్, సంతోష్, ప్రకాష్‌గౌడ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ


బియ్యం అందజేస్తున్న బీజేపీ నాయకులు


సరుకులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోల్కొండకు చెందిన ధూపం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం బీజేపీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బియ్యం అందజేశారు. బీజేపీ నాయకులు అన్నారం తిరుపతి, నెల్లి మహేశ్, బెనికి శ్యాంసుందర్, చిప్పకూర్తి వెంకటి, మేకల చంటయ్య తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బెజ్జూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బియ్యం అందజేశారు. తాజుద్దీన్, మహేష్, జావిద్, బాపు, అమిరుద్దీన్, మద్దూరి తిరుపతి, రాజన్న తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రీధర్

బెజ్జూర్: మండలంలోని సోమిని రైతు వేదికలో నకిలీ విత్తనాలపై ఏఈవో శ్రీధర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా లూజ్ విక్రయాలు జరిపితే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు రశీదులు తప్పనిసరిగా పొందాలని పేర్కొన్నారు. రైతుకు ఇచ్చిన రశీదులో లాట్ నంబర్, వెరైటీ పేరు, ఎక్స్‌పైరీ డేట్ వంటివి ఉన్నాయా, లేదా అనేది విత్తన ప్యాకెట్‌పై చూసుకోవాలని తెలిపారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

నేడు అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌రూరల్: రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు శనివారం పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈ సదస్సు కలెక్టర్, ఎస్పీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కాటన్ సీడ్స్ డీలర్లు, కాటన్ విత్తన కంపెనీల ఫీల్డ్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు పాల్గొంటారని తెలిపారు. నకిలీ విత్తనాలపై రైతులను చైతన్యపర్చేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’ పనుల్లో ప్రామాణికత పాటించాలి


పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో ప్రామాణికతను పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గేర్జంలో ఉపాధి పనులు పరిశీలించారు. సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. ప్రతీ రోజు కొలతలు సరిగ్గా చూసుకొని జాబ్‌కార్డులో నమోదు చేసే బాధ్యత సిబ్బందిదేనన్నారు.

పని చేసే వారికే డబ్బులు

నేరడిగొండ: ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకే డబ్బులు ఇవ్వాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం రాజుర గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పనులు చేయకుండా డబ్బులు తీసుకుంటే తమకు సమాచారం అందించాలని సూచించారు.

పక్కా భవనాలు కరువు



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ భవనం

- తాత్కాలిక భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు నిర్మించని వైనం


గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

లింగాపూర్: సిర్పూర్(యూ) నుంచి విడిపోయి 42 గ్రామాలతో లింగాపూర్ మండలంగా ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లు గడుస్తుంది. కానీ ఇంతవరకు మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, మండల సమాఖ్య కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో తాత్కాలిక భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయాల్లో అరకొర సౌకర్యాలు ఉండడంతో అటు సిబ్బంది, ఇటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

స్థలాల పరిశీలన..

మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు గతంలోనే జిల్లా అధికారులు మండల కేంద్రంలో పర్యటించి పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. కానీ నేటికీ భవనాల నిర్మాణాలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అంతేగాక ఎంపీడీవో కార్యాలయాన్ని పంచాయతీ భవనంలో, మహిళా సమాఖ్య భవనాన్ని శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి భవనంలో కొనసాగిస్తున్నారు. కాగా ఆయా భవనాల్లో సరిపడా గదులు లేక, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక సిబ్బందితో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

కొత్త భవనాలు నిర్మించాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆయా భవనాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే మాలాంటి వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కొత్త భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి.

– బానోత్ అంబాజి, పిక్లాతండా